# ఘరానా మావగారు

'నాగు'

చిన్నక్కయ్యపెళ్ళి ఒక పెద్ద సమస్యై కూచుంది మా యింట్లో. పెద్దక్కపెళ్ళితోనే దెబ్బతిన్న ఆర్థికపరిస్థితి కాస్త సర్దుకోవాలనేఉద్దేశంతో నాన్నగారు యీ విషయంపట్ల కాస్త అశ్రద్ధ చూపిన విషయం వాస్తవమే. అయితే నాన్నగారి అశ్రద్ధ హెచ్చినకొలది అమ్మచేసే ఒత్తిడి మరీ హెచ్చిపోయింది. అఖరికి ఎలాగయితేనేం, ఎవరి ప్రయత్నంమీద నయితేనేం ఎవరో దూరపుచుట్టాలు అక్కయ్యని చూడ్డాని కొస్తున్నామని వ్రాశారు. వ్రాయడ మేమిటి- వచ్చారు.

అయితే "కతికితే అతకదు" అనేసూత్రాన్ని అక్షరాలా అమలుపరచి మా వూళ్లోనే బంధువుల యింట్లో బస చేశారు. మర్నాడు సప్తమీ లక్ష్మివారం, పుష్యమి నక్షత్రం, అంతా బాగుంది పిల్లని చూడ్డాని కొస్తున్నామని కబురు చేశారు. అనుకున్నట్టే మధ్యాహ్నం మూడుగంటలకల్లా మగపెళ్ళివారంతా దిగబడ్డారు. అక్కయ్యని గంగిరెద్దులా ముస్తాబు




మద్రాసు పోత ఏజంట్లు, దాదా & కంపెనీ, పార్కుటౌన్, మద్రాసు-3.


చేశారు. అంతా అయింది. అతి బలవంతంమీద అల్పాహారాలు కూడా అయాయి. ఇక మగపెళ్ళివారు మళ్లా వాళ్లబసకు వెళ్లిపోతున్నారు. నాన్నగారుకూడా మెట్లుదిగేవరకూ వాళ్లతో వెళ్లి "ఉంటాను, బావగారూ"అన్నారు.

"ఆఁ - ఆఁ - మరి మీరుండండి. మళ్లా రేపు సావకాశంగా మాట్లాడుకుందాం" అంటూ క్రొత్త మావగారు సాగిపోయారు.

అలా కాస్సేపు నిలబడి వెనక్కి తిరిగి యింట్లోకి వెడుతూ 'అరే' అన్నారు నాన్న సావిట్లో.

ఏమిటా అని ఒక్క పరుగున లోనికి వెళ్లాను.

"చూడు! - ఆయన జోళ్లుమరచిపోయినట్టున్నారు. పటుకెళ్లి చేఁయ్" అన్నారు నాన్న సావిట్లో మూల నున్న జోళ్లు చూపిస్తూ.

"చిన్నవాళ్లయితే యిదే బాధ. ఏదో ఒకపని చెప్తూనే వుంటా"రనుకున్నాను. ఆయనకి జోళ్లు పట్టుకెళ్లివ్వడం నాకు నామోషి అనిపించింది. నాన్నగారి మాట వినిపించుకోకుండా ఆయన వెనకాల పరిగెట్టేను అప్పటి కాయన నట్టే దూరం పోలేదేమో దార్లోనే పట్టుకొని "ఏమండోయ్! మావయ్యగారూ! మీ జోళ్లు" అన్నాను.

'ఆఁ' అని ప్రశ్నార్థకంగా నా వైపుచూచా డాయన.

"మీ జోళ్లండీ. మా సావిట్లో మర్చిపోయార"న్నా మరి కొంచెం గట్టిగా.

"అవునబ్బీ పెద్దకాలమేమో, మతిమరుపు" అని నా వెనకాలే చకచకా వచ్చి జోళ్లు తొడుక్కొని శెలవు తీసుకొన్నా రాయన.

మరి కాస్సేపటికల్లా మా వీధి కొసనున్న మేస్టారొచ్చి మా సావిడంతా గాలించడం మొదలెట్టేరు.

"ఏమిటి మేస్టారూ" అంటూ పలకరించేరు మా నాన్న.

"నాజోళ్లు యిందాక వచ్చినప్పుడిక్కడ విడిచేనూ" అని నసుగుతూ తలుపు కొంచెం ముందుకు లాగి ఆమూలచూస్తున్నా డాయన.

"ఆహాఁ - మీ జోళ్లొస్తాయి కూర్చోండి" అంటూ మా నాన్న "ఒరే! సుభద్రగారింటి కెళ్ళి మామయ్యగారితో యిందాకటి జోడు మీవి గాను [illegible]

మీతో వచ్చాయని చెప్పి, అవి తీసుకురా'' అని నాకు ఆర్డరు వేసేరు.

ఇదంతా యేమిటన్నట్టు తెల్ల మొహం వేశాన్నేను.

"వెళ్లు" అని మళ్ళా ఉరిమేరు నాన్న.

చచ్చినట్టు వెళ్ళాను.

"మామయ్యగారూ! యిందాకటి జోళ్ళు మీవనిగావుట యిచ్చేయమన్నా"రన్నాను చల్లగా.

'ఆఁ' అంటూ చిన్న పోజు పెడుతున్నారప్పుడే ఆయన.

"అహాఁ – యిందాకటి జోళ్లు మావీధి కొసనున్న మేష్టరుగారివట. అవిపొరపాటున మీతో వచ్చాయని చెప్పమన్నారు" అని కొంచెంగట్టిగానే చెప్పాను.

"అహా" అని కళ్లజోడు సర్దుకుంటూ సావిడివరకూ వచ్చి "అవున్రా అబ్బీ యివినా జోళ్లుగావు. అసలు జోళ్లు తొడుక్కోకుండా వచ్చాని వాళ మీయింటికి. అదిమరచిపోయి జోళ్లు తొడుక్కునే వచ్చానన్న భ్రమతో నువ్వు జోళ్ళు మరచి పోయారండీ అంటే అహా ఔనుగామోసు ననుకుని తొడుక్కు చక్కా వచ్చా. తీసుకెళ్లిచ్చేయ్. యివి మనవిగావు." అని చేటభారతమంత సంజాయిషీతో జోళ్లుపట్టుకెళ్లడానికి పర్మిష నిచ్చారాయన.

ఉబికివచ్చే నవ్వును లోపలే ఆపుకుంటూ ఆవదులు జోళ్లిచ్చుకుని మెల్లిగా యింటికొచ్చాను. అంతే.

దేవుడుచాలా మేళ్లేసి మా అక్కకా సంబంధమే కుదిరింది.

ఆ వేళ పెళ్ళిపందిట్లో అంతా హడావుడిగా వున్నారు. ఇంకో గంట కళ్లాలగ్నం. మామామగారెందుకో విడిది కెళ్లాలొచ్చింది. పందిట్లోంచి గుమ్మందాకా వచ్చి "నా జోళ్ళేవర్రా" అని జోళ్లకుప్ప వెతుకుతున్నారు గుమ్మందగ్గర ఆయన.

"ఫరవాలేదు. ఏవో వొకటి తొడుక్కెళ్లురూ ఘరానా మామగారూ! మిమ్మల్నడిగే దెవరూ" అన్నా పందిట్లో పెట్రోమేక్సు లైటుదగ్గర గోల జేస్తున్న పిల్లల వనకాల్నుంచి నేను.

పందిట్లో చిన్నా పెద్దా అంతా ఒక్కసారి ఘొల్లుమన్నారు. మీరు నమ్మితే నమ్మండి లేకపోతే మానెయ్యండి గాని ఆనాటినుండీ మా యింట అందరం ఆయన్ని "ఘరానా మామయ్యా" నే పిలుస్తున్నాం.

